

యాదాద్రిలో భక్తుల కోలాహలం
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల కోలాహలం నెలకొంది. - 10లో



ఐదేళ్లుగా ఎన్నికలు లేవు..!
చేనేత సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసి ఐదేళ్లయినా నేటికీ ఎన్నికలు లేవు. - 10లో

గరిష్టం/కనిష్టం
36°/18°

వాతావరణం
ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీసీసీ పరీక్షలు ప్రారంభం

సూర్యాపేటటౌన్ : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) ఎగ్జామినేషన్ ఇన్ లోయర్, హయ్యర్ గ్రేడ్స్ ఇన్ డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ పరీక్ష పేపర్– 1 శనివారం జిల్లా కేంద్రంలోని నాలుగు సెంటర్లలో ప్రారంభమైంది. ఈ పరీక్షలు 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు జరిగిన పేపర్– 1 పరీక్షలో 548 మంది విద్యార్థులకు 233 మంది హాజరైనట్లు డీఈఓ అశోక్ తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు జరిగిన పేపర్– 2 పరీక్షకు 548 మందికి 232 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

సమగ్ర వ్యవసాయంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న లయోలా అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు

గరిడేపల్లి: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా అగ్రికల్చల్ కళాశాల విద్యార్థినులు గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో శనివారం రైతులకు సమగ్ర వ్యవసాయంపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో లాభం ఎలా పొందాలో వివరించారు. చిన్న, సన్న కారు రైతులు తమ పంటలతో పాటు పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, చేపలు, పట్టు పురుగుల పెంపకం చేపడితే కచ్చితమైన ఆదాయం పొందడమే కాకుండా భూసారాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధంగా ఖరీఫ్, రబీలో పంటల సాగుతో పాటు అనుబంధం పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆదాయం పొందవచ్చన్నారు. గట్లపై పశుగ్రాస మొక్కలు, కంచెగా కరొండా మొక్కలు నాటాలని, సేంద్రియ ఎరువులు, వర్మీకంపోస్ట్ తయారు చేసి వాడాలని తెలిపారు. కార్యక్రమంలో హోమ్ సైన్స్ కేవీకే శాస్త్రవేత్త సుగంధి, లయోలా విద్యార్థులు వి.శ్రావణి, వి.ధనలక్ష్మి, కె.హర్షిణి, వి.శ్రీయ, పి.మౌనిక, కె.శృతి, వి.తేజశ్రీ, వి.రమాదేవి తదితరులున్నారు.

జిల్లాకు గోదావరి జలాల పెంపు

అర్వపల్లి : జిల్లాకు గోదావరి జలాలను పెంచారు. వారబంధీ విధానంలో జిల్లాకు 1500 క్యూసెక్కుల నీరు ఇస్తుండగా 1700 క్యూసెక్కులకు పెంచారు. వీటిలో 69 డీబీఎంకు 550, 70 డీబీఎంకు 50, 71 డీబీఎంకు 1100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు శనివారం తెలిపారు. వ్యవసాయానికి నీటి వాడకం పెరగడంతో గోదావరి జలాలను పెంచినట్లు పేర్కొన్నారు. రైతులు కాలువలకు నష్టం కలిగించకుండా, పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శనివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చన జరిపించారు. ఎదుర్కోలు మహోత్సవం అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ల కౌన్సిలింగ్ ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలి

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయుల ప్రమోషన్లు వెబ్ కౌన్సిలింగ్‌లో కాకుండా ప్రత్యక్ష కౌన్సిలింగ్ పద్ధతిలో నిర్వహించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల పోస్టుల్లో 1:2 పద్ధతిలో ఉపాధ్యాయులు సర్వీస్ వెరిఫికేషన్ వెబ్ కౌన్సిల్ ద్వారా ఆప్షన్ తీసుకొని నిర్వహించడంతో అనేక హెచ్‌ఎం పోస్టులు మల్టీజోన్ దూర ప్రాంతాల కారణంగా ఖాళీగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పేర ముత్తయ్య, ప్రధాన కార్యదర్శి సీహెచ్.భిక్షం, సంఘం నాయకులు ఆర్.రామనర్సయ్య, కోటయ్య, రవికుమార్, పూలన్, వీరన్న, మల్లారెడ్డి, జానయ్య, కోటేశ్వర్‌రావు, నర్సయ్య, కిరణ్, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.



బరిగీసి.. బండ లాగి..

శివరాత్రి ఉత్సవాల్లో నిర్వహించే ఎడ్ల పందేలకు గిత్తలు సై అంటున్నాయి. బరిగీసి.. బండ లాగేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రత్యేక పర్యవేక్షకుల ద్వారా తర్ఫీదు పొందుతున్నాయి. లక్షల రూపాయల ఖర్చుకు సైతం వెనుకాడకుండా కొందరు ఔత్సాహికులు పోట్ల గిత్తలను పోషిస్తున్నారు.

సండే స్పెషల్

- ప్రత్యేక కథనం 8లో

● ఫ్రెషర్స్ డే



చిలుకూరు మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఫ్రెషర్స్ డేలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

పోడు హక్కు కొందరికే..

- కసరత్తు పూర్తి కాగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాలు
- మళ్లీ అడవిని నరకబోమని హామీ ఇచ్చేలా ఒప్పందం
- భారీగా దరఖాస్తు చేసుకున్నా అర్హత కొందరికే
- అధిక సంఖ్యలో దరఖాస్తుల తిరస్కరణ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు అందించేందుకు సిద్ధమైంది. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ కబ్జాలో ఉన్న అర్హులను గుర్తించి హక్కులు కల్పించేందుకు రికగ్నైజేషన్ ఆఫ్ ఫారెస్టు రైట్స్ (ఆర్‌ఓఎఫ్‌ఆర్) పట్టాలు ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మళ్లీ అటవిని నరుకబోమనే హామీతో ఈ హక్కులు కల్పించేలా కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇస్తామని గతంలో సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు కమిటీలు ఏర్పాటు చేసి, దరఖాస్తులను స్వీకరించి హక్కుదారులను తేల్చారు. మొత్తం దరఖాస్తుదారుల్లో 12 శాతం మందికే హక్కులు దక్కనున్నట్లు తెలిసింది.

నల్లగొండ జిల్లాలో 2649 మందికి..

నల్లగొండ జిల్లాలో 2,649 మంది రైతులకు పోడు భూములపై హక్కులు లభించనున్నాయి. క్షేత్ర స్థాయిలోని ఫారెస్టు రైట్స్ కమిటీలు (ఎఫ్‌ఆర్‌సీ) 3,285 మంది దరఖాస్తులకు ఆమోదం తెలిపినా, సబ్ డివిజన్, జిల్లా కమిటీలు 2,649 మంది రైతులకు హక్కులు కల్పించేందుకు ఓకే చెప్పాయి. మిగతా వారికి గతంలోనే డీఫారెస్టేషన్ పట్టాలు ఇచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ రైతులకు పోడు పట్టాలు ఇచ్చేందుకు ఐదువేల ఎకరాలకు పైగా భూమి క్లియర్‌గా ఉన్నట్లు తెలిసింది. వాటిల్లో ఈ రైతులకు పట్టాలు ఇచ్చే అవకాశం ఉంది.



- సూర్యాపేట జిల్లాలో 84 మంది రైతులకు 83.37 ఎకరాలకు పట్టాలు ఇచ్చేందుకు జిల్లా కమిటీ ఆమోదం తెలిపింది.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో కేవలం 200కు పైగా దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిసింది.

నల్లగొండలో గతంలో కంటే తక్కువే..

నల్లగొండ జిల్లాలో ఈసారి గతంలో కంటే తక్కువ మందికే పట్టాలు లభించనున్నాయి. 2006లో మొదటిసారిగా 8 వేల ఎకరాలు పట్టాలు ఇవ్వాలనుకున్నా అర్హులైన వారికి 7 వేల ఎకరాల వరకే పట్టాలు ఇచ్చారు. ఇప్పుడు 2,649 మంది రైతులకు ఐదువేల ఎకరాలకు పైగా ఇచ్చే అవకాశం ఉంది. అందులో మిర్యాలగూడ డివిజన్‌లో ఎఫ్‌ఆర్‌సీలు 2,053 రైతులు అర్హులని తేల్చాయి. వారికి పట్టాలు ఇవ్వాలని సిఫారసు చేశాయి. వారిలో జిల్లా కమిటీ 523 మంది రైతులకు దరఖాస్తులకు ఇప్పటికే ఆమోదం తెలుపగా, సబ్ డివిజన్ స్థాయి కమిటీ మరో 1,056 మంది దరఖాస్తులకు ఓకే చెప్పాయి. వాటిని జిల్లా కమిటీ ఆమోదించాల్సి ఉంది. ఎఫ్‌ఆర్‌సీలు సిఫారసు చేసిన 2,053 దరఖాస్తుల్లో మొత్తంగా 1,579 మంది రైతులకు భూములు లభించనున్నాయి. దేవరకొండ డివిజన్‌లోనూ ఎఫ్‌ఆర్‌సీలు 1,232 మంది రైతుల దరఖాస్తులకు ఆమోదం తెలుపగా, జిల్లా కమిటీ 692 దరఖాస్తులకు ఆమోదం తెలిపింది. డివిజన్ స్థాయి కమిటీ ఆమోదించిన మరో 378 దరఖాస్తులకు జిల్లా కమిటీ ఆమోదం లభించాల్సి ఉంది. మొత్తంగా 1,070 మందికి పోడు భూములపై హక్కులు లభించనున్నాయి.

అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలి



అర్హత కలిగిన రైతులందరికి పోడు భూములపై హక్కులు కల్పించాలి. సర్వే విషయంలో అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టలేదు. కొంతమందికి ఇచ్చి అనేక మందిని అనర్హులుగా ప్రకటించడం సరికాదు. తిరస్కరించిన దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మళ్లీ పరిశీలించాలి.

– వీరేపల్లి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

వేల ఎకరాల భూమి కోసం భారీగా దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో పోడు భూములపై హక్కుల కోసం 29,949 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో అడవిదేవులపల్లి, చందంపేట, చింతపల్లి, దామరచర్ల, దేవరకొండ, డిండి, మిర్యాలగూడ, నేరెడుగొమ్ము, నిడమనూరు, పీఏపల్లి, పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), త్రిపురారం మండలాల్లోని 119 గ్రామపంచాయతీలు, 160 ఆవాస గ్రామాలకు చెందిన 20,446 మంది రైతులు 55,702 ఎకరాలపై హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సూర్యాపేట జిల్లాలో చింతలపాలెం, మఠంపల్లి, మేళ్లచెర్వు, పాలకీడు మండలాల్లో 25,120 ఎకరాలపై హక్కుల కోసం 7,373 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని తుర్కపల్లి, నారాయణపూర్, చౌటుప్పల్‌లో 6,133 ఎకరాల కోసం 2,133 మంది దరఖాసు చేసుకున్నారు.

రాజీ పడితే స్నేహపూర్వక సంబంధాలు

● సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్ : కేసుల్లో రాజీ పడడం వల్ల స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడతాయని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ కోర్టులో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కక్షిదారులు తమ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం వల్ల వారి మధ్య ఉన్న శత్రుత్వ భావం తొలగి స్నేహ పూర్వక సంబంధాలు ఏర్పడతాయని తెలిపారు. రాజీచేసుకున్న కేసుల్లో కోర్టుకు చెల్లించిన ఫీజును తిరిగి కక్షిదారులకు అందజేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా కాలం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి సాకేత్ మిత్ర మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో జారీ కాబడిన అవార్డుపై అప్పీల్ చేసుకునే అవకాశం లేదని, ఆ అవార్డు శాశ్వతమైనదన్నారు. భవిష్యత్‌లో ఎప్పుడైనా సమస్య తిరిగి వస్తే అవార్డును అమలు పరచాలని తిరిగి కోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. బ్యాంకు అప్పులకు సంబంధించి లోక్ అదాలతో రాజీ చేసుకోవడం వల్ల బ్యాంకులకు చెల్లించాల్సిన అప్పు నుంచి రాయితీ పొందవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో 39 క్రిమినల్ కేసులు, 17 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. 1,298 డ్రంకెన్ డ్రైవ్ కేసులతో పాటు వివధ కేసుల్లో కక్షిదారులు జరిమానాల రూపంలో రూ.10.50 లక్షలు చెల్లించారు. బ్యాంకుల బాకీలకు సంబంధించి రూ.4.47 లక్షలు చెల్లించారు. జరిమాన పైకం రూ.10.50 ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని న్యాయ మూర్తులు ఆదేశించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు కమతం నాగర్జున, కొట్టు సురేష్, దొంతిరెడ్డి నారాయణరెడ్డి, చనగాని మహేష్, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, రవికుమార్, కష్ణయ్య, అంజయ్య, వెంకటేశ్వర్లు, సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐలు, కోర్టు సిబ్బంది, బ్యాంకు మేనేజర్లు, పారా లీగల్ వలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులకు మంత్రి అండ

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో అవినీతి అధికారులకు మంత్రి జగదీశ్‌రెడ్డి అండగా ఉంటున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దగట్టులో గత నాలుగు జాతరలకు టెండర్లు, హుండీల ద్వారా రూ.3కోట్ల ఆదాయం వచ్చిందని వీటితో పాటు రూ.19.50కోట్లు పెద్దగట్టుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తే తాత్కాలిక పనులు తప్ప శాశ్వత పనులు చేపట్టలేదని ఆరోపించారు. తొమ్మిదేళ్ల నుంచి ఎస్పీ ఆఫీస్, కలెక్టరేట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టరేట్ పక్కన రియల్ ఎస్టేట్ పేరుతో రూ.900కోట్ల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అబీద్, నాయకులు మన్మథరెడ్డి, సలిగంటి వీరేంద్ర, చలమల్ల నర్సింహ, పల్సా మల్సూర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్డులకు మోక్షం కలిగేనా?

- ఏడాదిన్నర నుంచి జారీ కాని నూతన రేషన్ కార్డులు
- 25,179 రేషన్ దరఖాస్తులు, 46,354 మ్యూటేషన్ దరఖాస్తులు పెండింగ్‌లోనే..
- అసెంబ్లీలో మంత్రి ప్రకటనతో దరఖాస్తుదారుల్లో చిగురిస్తున్న ఆశలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఆహార భద్రత కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం చెబుతోంది.. అయితే ఏడాదిన్నర నుంచి కార్డులు మంజూరు చేయకపోవడంతో అర్హులైన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2021 జూలైలో అప్పటికే మూడున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నూతన కార్డులను జారీ చేశారు. మళ్లీ ఏడాదిన్నర గడిచినా నూతన కార్డులు మంజూరు కావడం లేదు. ఇదిలా ఉండగా జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి మ్యూటేషన్లకు మోక్షం కలగలేదు. కరోనా నేపథ్యంలో గత కొన్ని నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో వ్యక్తికి 10కిలోల చొప్పున రేషన్ బియ్యం ఉచితంగా అందజేస్తున్నది. వీటికి అర్హులైన పేదలు దూరమవుతున్నారు. ఇటీవల అసెంబ్లీలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఆరోగ్య సేవలకు దూరం..

రేషన్ కార్డులు ఉన్నవారికి మాత్రమే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు అందుతుండగా, కార్డులు లేని వాళ్లు ఆ సేవలకు నోచుకోవడం లేదు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి దక్కాల్సిన ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియను పునరుద్ధరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పెండింగ్‌లో 71,533 దరఖాస్తులు

ఆహార భద్రత కార్డులో మార్పులు, చేర్పులకు జిల్లాలో 46,354 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా ఏర్పాటు నుంచి ఈ దరఖాస్తులకు మోక్షం లేదు. ఇక జిల్లాలో 2021 జూలై నుంచి నూతన కార్డుల మంజూరు కోసం 25,179 దరఖాస్తులు అందాయి. దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు నూతన కార్డుల కోసం మూడున్నరేళ్లుగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మొత్తం 71,533 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు.

మార్పులు, చేర్పుల కోసం..

ఈ– పాస్ వెబ్‌సైట్ ద్వారా రేషన్ కార్డుల కోసం ఉన్న వాటిలో మార్పులు, చేర్పుల కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు పరిశీలించి జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి లాగిన్‌కు పంపించారు. ఇక్కడ వాటిని పరిశీలించిన అధికారులు మంజూరుకు సిద్ధమైనప్పటికీ ఏడాదిన్నర నుంచి లాగిన్ తెరుచుకోవడం లేదు. ఉమ్మడి కుటుంబం నుంచి వేరుపడిన వాళ్లు కొత్తగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా ఇది వరకే ఉన్న కార్డులోంచి వారి పేరును తొలగిస్తేనే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అలా చాలా మంది కొత్త కార్డుల కోసం ఉమ్మడి కుటుంబం కార్డుల నుంచి పేర్లను తొలగించుకొని నూతన కార్డులకు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ కార్డులు మంజూరు కావడం లేదు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి వచ్చిన వారు కూడా కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా వారికీ మంజూరు కావడం లేదు. 2018 డిసెంబర్ ఎన్నికలు జరిగే వరకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం నిరంతరంగా సాగించింది. ఆ తరువాత 2021 జూలైలో హుజురాబాద్ ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్తంగా మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నూతన రేషన్ కార్డుల దరఖాస్తులకు మోక్షం కలిగింది. జిల్లాలో సుమారు 12 వేల నూతన కార్డులు మంజూరయ్యాయి. కాని మ్యూటేషన్లపై నిర్ణయం తీసుకోలేదు. ఆ తరువాత దరఖాస్తులకు మళ్లీ మోక్షం లేదు.

జాబ్‌కార్డుకు అనుసంధానమైతేనే వేతనం

- ఉపాధి హామీలో కొత్త నిబంధన
- పారదర్శకత కోసం బ్యాంక్ ఖాతా అనుసంధానం తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- కూలీలకు తప్పని తిప్పలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

హుజూర్‌నగర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఉపాధి కూలీల జాబ్ కార్డుకు వారి బ్యాంక్ ఖాతా అనుసంధానం ఉంటేనే ఆయా కూలీలకు వేతనం జమ కానుంది. ఈవిధానాన్ని ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరి చేశారు. దీంతో కొద్ది మంది కూలీలు పనులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటి వరకు ఆధార్‌తో కూలీలకు సొమ్ము చెల్లింపులు చేసేవారు. ప్రస్తుతం జాబ్ కార్డుకు బ్యాంక్ ఖాతా అనుసంధానమైతేనే వేతన సొమ్ము వారి ఖాతాల్లో జమ కానుంది.

పారదర్శకంగా జరిగేలా మార్పులు..

ఉపాధిహామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులు కూలీలకు ఇబ్బందిగా మారుతున్నాయి. కూలీలకు రెండు నుంచి మూడు వరకు వివిధ బ్యాంకుల ఖాతాలు ఉన్నాయి. వివిధ అవసరాల కోసం వారు పలు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద నేరుగా లబ్ధిదారు ఖాతాలకు సొమ్ము జమ చేస్తున్నారు. సదరు బ్యాంక్ ఖాతాకు ఎక్కువ మంది ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకున్నారు. జాబ్ కార్డు పొందిన సమయంలో ఇచ్చిన బ్యాంకు ఖాతాకు చాలామంది ఆధార్‌ను అనుసంధానం చేసుకోలేదు. దీంతో ఇప్పుడు ఆయా కూలీలకు పనిచేసినా డబ్బులు జమ కాని పరిస్థితి నెలకొంది. ఈ ప్రక్రియను పూర్తి చేయాలంటే మరికొంత సమయం పడుతుంది.

జిల్లాలో ప్రస్తుతం 3,51,253 మంది కూలీలు..

జిల్లాలో ప్రస్తుతం 3,51,253 మంది కూలీలు ఉన్నారు. వారిలో 2,257 మంది జాబ్‌కార్డులు అనుసంధానం చేసుకోలేదు. వారిలో 3,30,849 మంది ఆధార్ ధ్రువీకరణ ముగిసింది. ఇంకా 11,749 మందికి కూలీల ఆధార్, జాబ్‌కార్డుల పేర్లు సరిపోలక అసంపూర్తిగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా బ్యాంక్ ఖాతాలు అనుసంధానం అయిన వారు మాత్రమే ఉపాధి పనులకు వచ్చే అవకాశం ఉంది. మిగతా వారు ఉపాధి పనికి కొన్ని రోజులపాటు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ పథకాన్ని నేషనల్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ (ఎన్‌ఐసీ) పరిధిలోకి తీసుకొచ్చిన తర్వాత మార్గదర్శకాలు, నిబంధనలు కఠినతరం చేశారు. పనుల ఎంపిక నుంచి సొమ్ము చెల్లింపుల వరకు పూర్తిగా పారదర్శకంగా జరిగేలా మార్పులు తీసుకువచ్చారు.

కూలీలకు నష్టం వాటిల్లకుండా చర్యలు



అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ ప్రత్యేక చొరవతో సమన్వయం చేయడంతో అనుసంధాన ప్రక్రియలో ఇబ్బదులు అధిగమిస్తున్నాం. దీంతో కూలీలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటి వరకు జాబ్‌కార్డు, ఆధార్, బ్యాంక్ ఖాతాల అనుసంధానం ప్రక్రియ దాదాపు 97 శాతం వరకు పూర్తి కావచ్చింది. మిగిలిన వారివి కూడా త్వరలోనే పూర్తి చేస్తాం.

– డాక్టర్ పెంటయ్య, డీఆర్‌డీఓ, సూర్యాపేట

కొత్త నిబంధనలు కొంత ఇబ్బందికరం..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు కొంత వరకు ముగియడంతో ఫిబ్రవరి నుంచి ఉపాధిహామీ పథకానికి కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరవుతారు. కానీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నిబంధన కొంత ఇబ్బందికరంగా మారింది. జనవరి నెలాఖరు వరకు జాబ్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగింది. జిల్లాలో పలు కారణాల వల్ల ఇంకా 2,257 కూలీలు ఆధార్ అనుసంధానం చేసుకోలేదు. ఇప్పుడు మళ్లీ జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానంతో పాటు బ్యాంక్ ఖాతా కూడా అనుసంధానం చేయాలనే నిబంధన పెట్టారు. ఈ ప్రక్రియ పూర్తి కాకపోతే సంబంధిత కూలీలు పనిచేసినా వేతనం రాదు. దీంతో రోజురోజుకు పని ప్రదేశాల్లో కూలీల హాజరు తగ్గుముఖం పట్టనుంది. జిల్లా వ్యాప్తంగా ప్రతి పంచాయతీ నుంచి ప్రస్తుతం రోజు 50 మందికి పైగా కూలీలు హాజరుకావాలి. ప్రస్తుతం 30 నుంచి 40 మంది మాత్రమే హాజరవుతున్నారు. కొన్ని పంచాయతీల్లో అంతకన్నా తక్కువ మందే హాజరవుతున్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం



మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట క్రైం : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో శనివారం రాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపొద్దని, బైక్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలని తెలిపారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో చాటింగ్ చేయొద్దని సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. పట్టణంలో షీ టీమ్‌ల ద్వారా మహిళలకు రక్షణగా బాలికలకు కళాశాలల వద్ద బస్టాండ్‌లు, మార్కెట్‌ల వద్ద గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజశేఖర్, నాగార్జున, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులను తలపించే బలమైన కాడెద్దులు.. వాటి మెడలోని కాడికి క్వింటాళ్ల కొద్దీ బరువుండే బండరాళ్లు.. బండను లాగడానికి గిత్తలను సంసిద్ధం చేయడానికి చెర్నకోలాలను పట్టుకొని హడావుడి చేసే ట్రైనర్లు.. పందెపుటెడ్ల చూట్టూ చేరి ఈలలు, కేరింతలతో ప్రేక్షకులు చేసే సందడి.. ఏ గిత్తలు గెలుస్తాయో అనే ఆత్రుత, ఉత్కంఠ. శివరాత్రి వచ్చిందంటే.. దేవాలయాల వద్ద నిర్వహించే సంప్రదాయపు ఎండ్ల పందేల వద్ద కనిపించే దృశ్యాలు ఇవీ..


ఇటీవల కోదాడలో జరిగిన పోటీల్లో బండ లాగుతున్న గిత్తలు


• బుల్ షో

బరిగీసి.. బండ లాగి..

పోటీకి సై అంటున్న పోట్ల గిత్తలు

- శివరాత్రి జాతర్లలో ప్రత్యేక ఆకర్షణగా పోటీలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల నిర్వహణ
- ఇతర రాష్ట్రాల్లో జరిగే పోటీలకూ మన పోట్ల గిత్తలు
- రూ.లక్షలు ఖర్చుచేసి గిత్తలను పోషిస్తున్న ఔత్సాహికులు
- ఎద్దులకు ఆహారం.. శిక్షణ ప్రత్యేకమే..
- ఒక జత గిత్తలకు ఏడుగురు ట్రైనర్లు
- వాటిని నిరంతరం చూసుకునేందుకు ఇద్దరు పర్యవేక్షకులు
- పేరు, సరదా కోసమే పందెపుటెడ్ల పెంపకం


హుజూర్‌నగర్‌లోని సుంకి సురేందర్‌రెడ్డి గిత్తలకు తర్ఫీదు ఇస్తున్న శిక్షకులు


కోదాడ : రామలక్ష్మీపురంలో శ్రీనివాసరెడ్డి పెంచుతున్న గిత్త

(సాక్షి, నల్లగొండ డెస్క్)

పోట్ల గిత్తలు సత్తా చూపేందుకు బరిలు సిద్ధమవుతున్నాయి. ప్రతియేటా శివరాత్రి సందర్భంగా పలుచోట్ల జాతరల వద్ద జరిగే పోటీలకు గిత్తలు రెడీ అవుతున్నాయి. ఒకప్పుడు ఆంధ్రా ప్రాంతానికే పరిమితమైన ఎడ్ల పందేలపై ఇప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సైతం పలువురు రైతులు ఉత్సుకత చూపుతున్నారు. లక్షల రూపాయల ఖర్చుకు కూడా వెనుకాడకుండా గిత్తలను పెంచుతున్నారు. ఎడ్ల పందేల్లో గెలుపు ఇచ్చే కిక్ కోసం పోటీలు ఉన్న ప్రతి చోటుకూ వెళ్తున్నారు. తమ పోట్ల గిత్తలను కన్న బిడ్డలకన్నా మిన్నగా పెంచుకుంటున్నారు. గిత్తలను పెంచడం, వాటిని పోటీలకు తీసుకెళ్లడం, అవి గెలుపొందడం తమ స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. తమ గిత్తలను బరిలోకి దింపి విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. గిత్తలను పెంచడం కోసం వీరు చేస్తున్న ఖర్చులో సగం కూడా రాని పందెం డబ్బు కోసం కాకుండా.. పేరు, పరపతిగా భావించి పోటీల్లో పాల్గొంటున్నారు.


గిత్తలను నీటితో కడుగుతున్న పర్యవేక్షకుడు

సండే స్పెషల్

ఎలా మొదలయ్యాయంటే..

వ్యవసాయంలో అన్నదాతలకు చేదోడు వాదోడుగా ఉండే ఎద్దులను రైతులు సొంత బిడ్డల్లా సాకుతారు. తాము పెంచే ఎద్దుల సామర్థ్యాన్ని చాటుకోవడం కోసం, ఎంత బలిష్టంగా ఉన్నాయో చెప్పుకోవడానికి గతంలో చిన్నచిన్న బండరాళ్లను, ఇసుక బస్తాలను కట్టి లాగించే వారు. ఇదే కాలక్రమేణ ఎడ్ల పందేలుగా మారింది. క్వింటాళ్ల కొద్దీ బరువుండే బండరాళ్లను లాగే పోట్ల గిత్తలను తయారు చేసి వాటికి బలమైన ఆహారాన్ని ఇస్తూ పోటీలకు సై అంటూ ముందుకు పోతున్నారు ఔత్సాహికులు.

రోజూ శిక్షణ

పందెపు గిత్తలను వ్యవసాయ పనులు చేయిస్తూనే మరో పక్క వీటికి బండ లాగే పోటీలో శిక్షణ ఇస్తుంటారు. రోజూ తెల్లవారు జామునే షెడ్ల నుంచి బయటకు తీసుకొచ్చి దాదాపు కిలోమీటరు దూరం నడిపిస్తారు. కొంత దూరం ఉరికిస్తారు. పోటీల సీజన్‌లో మాత్రం వారంలో రెండు రోజులు వీటికి బండరాళ్లను కట్టి లాగిస్తూ ట్రెనింగ్ ఇస్తారు. మరో రెండు రోజులు ట్రైర్‌బేటా వేస్తారు. దీని కోసం ప్రత్యేకంగా కొందరిని నియమిస్తారు. ఆ తరువాత బలమైన ఆహారం ఇస్తారు.


గుంటూరు జిల్లా తూములూరులో బహుమతి అందుకుంటున్న సుంకి సురేందర్‌రెడ్డి (ఫైల్)

పోటీలు ఇలా..

ఎడ్ల పందేల్లో ముఖ్యమైనది వివిధ బరువులతో ఉండే బండ రాళ్లను లాగడం. సాధారణంగా పోటీలకు నిర్వాహకులు రెండు రకాల బరులను సిద్ధం చేస్తారు. ఒకటి 200 అడుగులు, మరొకటి 300 అడుగుల పొడవు ఏర్పాటు చేస్తారు. 20 అడుగుల వెడల్పు ఉంటుంది. బరిలో ఒక వైపు నుంచి రెండవ వైపు వెళ్లి మళ్లీ మొదటి వైపునకు వస్తే ఒక రౌండ్ అంటారు. ఇలా నిర్ణీత సమయంలో ఎన్ని ఎక్కువ రౌండ్లు వేస్తే ఆ జత గెలిచినట్లుగా ప్రకటిస్తారు. పందేలు నిర్వహించే చోటు నుంచి దాదాపు 15 చానళ్లు లైవ్ ఇస్తాయి. పోటీల వీడియోలు కూడా అందుబాటులో ఉంచుతాయి.

దూడల ఎంపిక కీలకం

ఎడ్ల పందేలకు గిత్తలను తయారు చేయాలనుకునే వారు అవి దూడలుగా ఉన్న సమయంలోనే ఎంపిక చేసుకుంటారు. సాధారణంగా ఒంగోలు జాతి దూడలను ఎంచుకుంటారు. పోటీల్లో రాణించాలంటే గిత్తలకు ఎముక బలం ఎక్కువగా ఉండాలి. గంగడోలు, గిట్టలు, తోక పొడవు, చెవులు ఇలా ప్రతి లక్షణం చూసి దూడలను ఎంపిక చేసుకుంటారు. పాలు మరిచిన సమయంలోనే గ్రామాల్లో లేదా, పేరున్న సంతల్లో వీటిని కొనుగోలు చేస్తారు. పాలు మరిచిన దూడల ఖరీదు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. ఇవి కొంచెం పెద్దవి కాగానే వాటిని వ్యవసాయ పనులకు సాగదీస్తారు. వ్యవసాయ పనులు చేస్తేనే **గిత్తలు బలిష్టంగా ఎదుగుతాయని రైతులు భావిస్తారు.**

ఖర్చు దండిగానే..

పందెపుటెడ్లను సాదాలంటే డబ్బులు దండిగానే ఉండాలి. జత గిత్తలకు **రోజువారి** దాణ, **ఇతర** ఖర్చులు **కలిపి** దాదాపు **2,400** వరకు అవుతాయి. దీంతో **పాటు** వీటి కోసం **ఇద్దరు** ట్రైనర్లు ఉండాలి. ఇలా జత **పందెపుటెడ్ల** ఖర్చు **నెలకు** రూ.50 వేల **నుంచి రూ.60 వేల** వరకు వస్తుంది. ఇలా పెంచిన ఎద్దులు పందేలకు వెళ్లి **రూ.లక్ష నుం**చి రూ.ఐదు **లక్షల వరకు ప్రైజ్‌మనీ** గెలుచుకున్న **సందర్భాలు ఉంటాయి. వీటి**ని పందెలు జరిగే ప్రదేశాలకు తరలించడానిక ప్రత్యేకంగా తయారు చేయించిన డీసీఎం వ్యాను కూడా ఏర్పాటు చేస్తారు.

• ఉమ్మడి జిల్లాలో ఎద్దుల పోటీలు జరిగే ప్రాంతాలు : మేళ్లచెర్వు, మఠంపల్లి, దొండపాడు, రఘునాథపాలెం, నక్కగూడెం, చింత్రియాల, రేబల్లె, వేపల మాదారం, కోదాడ, బేతవోలు, బట్టుగూడెం, రామన్నగూడెం, తిరుమలగిరి, కుంకుడుచెట్టుతండా. ఆయా గ్రామాల్లో జాతరల సందర్భంగా ఎద్దుల పోటీలు నిర్వహిస్తారు. మేళ్లచెర్వులో నిర్వహించే పందేలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉంటుంది.

పోటీల్లో కేటగిరీలు ఇలా..

ఎడ్ల పందేల్లో గిత్తల వయస్సును బట్టి వీటిని వివిధ కేటగిరీలుగా విభజిస్తారు

కేటగిరీ	వేసే బండ బరువు (క్వింటాళ్లు)	లాగే సమయం (నిమిషాల్లో)
టచ్‌పళ్ల గిత్తలు (వీటికి ఇంకా పళ్లు రావు)	4 నుంచి 5	10
జతపళ్ల గిత్తలు (వయసు 2సంవత్సరాల పైన)	6 నుంచి 8	10
నాలుగు పళ్ల గిత్తలు (2 నుంచి 3సంవత్సరాల లోపు)	8 నుంచి 10	15
ఆరుపళ్ల గిత్తలు (3 నుంచి 4సంవత్సరాల లోపు)	10 నుంచి 12	15
వ్యవసాయ విభాగం	12 నుంచి 16	20
సబ్ జూనియర్ విభాగం	16 నుంచి 18	20
జూనియర్ విభాగం	18 నుంచి 20	20
సీనియర్ విభాగం	20 నుంచి 24	25


సీనియర్ విభాగానికి వచ్చిన ఎద్దులు వయస్సు 7 సంవత్సరాలు ఉంటుంది.


అదిరిపోయే ఆహారం..


గిత్తలకు తయారవుతున్న దాణా

- గిత్తలకు పొద్దున్నే ఎండు ఖర్జూరా, అంజీరా తినిపిస్తారు. ఎండుగడ్డిని పెట్టి ఆ తరువాత శుభ్రమైన నీటితో కడుగుతారు. తడి ఆరిన తరువాత షెడ్లలోకి తీసుకువస్తారు. వేసవిలో వీటిని ఉదయం, సాయంత్రం నీటితో కడుగుతారు.
- షెడ్లలోకి రాగానే ఉలవ పిండి దాణాతో పాటు బీన్స్, బీట్‌రూట్, ఆపిల్ ముక్కలు చేసి పెడతారు. బాదం పప్పులను నానబెట్టి ముద్దగా చేసి తినిపిస్తారు.
- మధ్యాహ్నం బార్లీ, రాగులు, కొర్రలతో చేసిన జావను తాగిస్తారు. సాయంత్రం మరోసారి ఉలవ పిండి దాణా పెడతారు. ఇక ఉదయం నుంచి రాత్రి వరకు ఎండు గడ్డి నిరంతరం వేస్తుంటారు. ఎండు జొన్న చొప్ప కూడా వేస్తారు. మధ్యాహ్నం పచ్చి జొన్నగడ్డి వేస్తారు.
- ఆరోగ్యంగా ఉండడానికి బలవర్ధకర ఆహారంతో పాటు గిత్తలో బలం, గట్టిదనం కోసం మందులను ఇస్తుంటారు. వారాని రెండు సార్లు కాల్షియం సిరప్‌ను దాణాలో కలిపి ఇస్తారు. గిత్తల లివర్ ఆరోగ్యంగా ఉండడానికి వాటికి అప్పుడప్పుడు బ్రోటోన్ లిక్విడ్‌తో పాటు కొన్ని రకాల విటమిన్లను దాణాలో కలిపి ఇస్తారు. అంతే కాకుండా నెలకు రెండు సార్లు పశువైద్యుడి చేత చెకప్ చేయిస్తారు. పెంపకం దారులు ఎక్కువగా గిత్తలకు హోమియోపతి మందులు ఇస్తారు. ఈగలు, దోమలు రాకుండా నిరంతరం షెడ్లలో ఫ్యాన్లు తిరుగుతుంటాయి. గిత్తల విసర్జితాలను ఎప్పటికప్పుడు తొలగించి షెడ్లను శుభ్రం చేస్తుంటారు. గిత్తలు పడుకునేందుకు వీలుగా కింద మ్యాట్‌లు వేస్తారు.


బీన్స్


బీట్‌రూట్


కొర్రలు


నువ్వుల పిండి


రాగులు

పోటీల్లో పాల్గొనడం సరదా..



తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన ఎడ్ల పందాల్లో నా గిత్తలకు ప్రతి చోటా ప్రైజ్ వచ్చింది. నాకు ఎడ్ల పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి కలగడంతో 2014లో రెండు లక్షల రూపాయలకు ఒకటి చొప్పున రెండు ఎడ్లను కొనుగోలు చేశాను. తొమ్మిది సంవత్సరాల్లో మూడు జతల పందెం ఎడ్లను సాకాను. వయస్సు పైబడడంతో రెండు జతలు అమ్మేశాను. ఇప్పుడు మూడో జతతో ఎడ్ల పందేలకు వెళ్తున్నా. వాటికి రోజూ వెయ్యి రూపాయల వరకు దాణా ఖర్చు అవుతుంది. ఉదయం బాదం పప్పు, ఉలవలు, రెండు లీటర్ల ఆవు పాలు, మధ్యాహ్నం, రాత్రి కూడా ఉలవలు, జొన్న లాంటి బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నా. ప్రస్తుతం ఉన్న ఎద్దులతో 18 క్వింటాళ్ల బండ రాయి(జూనియర్) లాగే పోటీలకు తీసుకెళ్తున్నా. పోటీల్లో గెలిస్తే వచ్చే ఆదాయం కోసం కాకుండా పాల్గొనడం ఒక సరదాగా మారింది.

– సంకూరి అనంతరాములు, సూరేపల్లి, నిడమనూరు మండలం

ఆదాయం కోసం కాదు.. పేరు కోసమే..



నేను 16 ఏళ్లుగా ఎద్దుల పోటీల్లో పాల్గొంటున్న. నల్లగొండతోపాటు ఖమ్మం, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో జరిగే ఎద్దుల పోటీల్లో పాల్గొన్నా. ఇప్పటి వరకు 200కు పైగా బహుమతులు వచ్చాయి. పోటీల్లో పాల్గొనే ఎద్దులకు ప్రత్యేక ఆహారంతో పాటు తర్ఫీదు ఇవ్వాలి. అవి దూడగా ఉన్నప్పుడు తీసుకుని వచ్చి తర్ఫీదు ఇస్తాం. మరికొన్నింటిని నేరుగా కొనుగోలు చేస్తుంటాం. ప్రస్తుతం నా వద్ద నాలుగు ఎద్దులు ఉన్నాయి. వీటి విలువ రూ.30 లక్షలకు పైగా ఉంటుంవా. 60 సంవత్సరాలుగా మా ఇంట్లో పందెపు ఎద్దులు ఉండేవి. ఆ సంప్రదాయాన్ని అలాగే కొనసాగిస్తున్నా. ఎద్దుల పోషణ ఖర్చులకు.. వచ్చిన బహుమతులు, డబ్బులు ఏ మూలకూ సరిపోవు. వారసత్వంగా వస్తున్న పేరు నిలబడటం కోసమే ఎద్దుల పోటీలకు వెళ్తున్నాం.

– శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మీపురం, కోదాడ మండలం

చిన్నప్పటి నుంచి ఎద్దులు అంటే ఇష్టం



నేను స్వతహాగా జంతు ప్రేమికుడిని. అందులో ఎద్దులు అంటే చాలా ఇష్టం. మాది వ్యవసాయ కుటుంబం. మా తాత కాలం నుంచి మాకు పశుసంపద బాగా ఉండేది. ఎద్దులను బాగా చూసుకోవడం, బలిష్టంగా పెంచడం ఒక అలవాటుగా మారింది. నేను పోలీస్ శాఖలో చేరి దూరప్రాంతంలో ఉద్యోగం చేస్తున్నా.. తరచుగా హుజూర్‌నగర్‌లోని వ్యవసాయాన్ని, ఎద్దులను చూసుకునేందుకు వస్తున్నా. పందెం గిత్తలను ప్రత్యేకంగా పోషిస్తున్నాం. పోటీలకు ఉపయోగపడే లక్షణాలున్న దూడలను కొనుగోలు చేసి వాటిని ప్రత్యేకంగా పెంచుతాం. వాటిని నిరంతరం చూసుకునేందుకు వర్కర్లను పెట్టాను. 2007 సంవత్సరం నుంచి ఎద్దుల పోటీల్లో పాల్గొంటున్నా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, కర్నాటకలోనూ జరిగిన పోటీల్లో మా గిత్తలు పాల్గొన్నాయి. ఇప్పుడు ఏపీ, తెలంగాణతో పాటు రాయచూర్‌లో పోటీలకు వెళ్తున్నాయి. అనేక చోట్ల బహుమతులు పొందాయి.

– సురేందర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ, జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

కాల్వలో పడి చిన్నారి మృతి


కీర్తన మృతదేహం కోసం కాల్వ వద్ద వెతుకుతున్న బంధువులు


కీర్తన (ఫైల్)

- అనుమల మండల పరిధి పంగవానికుంటలో విషాదం

హాలియా : అభం శుభం తెలియని ఓ తొమ్మిదేళ్ల పసిపాప ఆటలాడుకుంటూ వెళ్లి ఇంటి పక్కనే ఉన్న రాజవరం మేజర్ కాల్వలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృత్యుఒడికి చేరింది. ఈ ఘటన అనుముల మండలంలోని పంగవానికుంట గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పంగవానికుంట గ్రామానికి చెందిన ఇరిగిదిండ్ల సైదులు, రేణుక దంపతులకు కుమార్తె కీర్తన (09), కుమారుడు నరేష్ కలరు. రెక్కాడితే డొక్కాడని కుటుంబం కావడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో తమ ఇద్దరి పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె కీర్తన ప్రాథమిక పాఠశాల్లో మూడవ తరగతి చదువుతుండగా కుమారుడు రెండవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లి వచ్చిన కీర్తన శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఆటలాడుకుంటూ పక్కనే ఉన్న రాజవరం మేజర్ కాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి నీట మునిగి మృత్యువాత పడింది. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలం వద్దకు చేరిన కుటుంబ సభ్యులు, బంధువులు చిన్నారి కీర్తన ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న చిన్నారి కీర్తన విగత జీవిగా కళ్లముందు నిలవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కన్నవారు, బంధువుల రోదనలతో ఆ ఊరు శోకసంద్రమే అయింది. హాలియా-నాగార్జున సాగర్ 167వ జాతీయ రహదారి పంగవానికుంట గ్రామం మీదుగా ఉంది. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా రాజవరం మేజర్ కాల్వపై నూతన బ్రిడ్జిని నిర్మించి గతంలో కాల్వకు ఇరువైపులా ఉన్న మెట్లను తొలగించారు. కాల్వకు ఇరువైపులా రక్షణ ఏర్పాటు చేయకపోవడం కారణంగానే చిన్నారి కాల్వలో పడి మృతి చెందిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నారి కాల్వలో పడి మృతి చెందిన ఘటన పోలీసులకు సమాచారం తెలియరాలేదు.

వలిమా వేడుకకు వచ్చి..


ఎస్‌కే లతీఫ్(ఫైల్)

నిడమనూరు: ఈత సరద ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ ఘటన నిడమనూరు మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. నిడమనూరు మండలం నారమ్మగూడేనికి చెందిన ఎస్‌కే సైదావలికి అక్రం, అబ్దుల్ లతీఫ్(22) ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అక్రం వివాహం హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. ఆదివారం ఇంటివద్ద వలీమా జరిపించడానికి శనివారం నారమ్మగూడేనికి వచ్చారు. శనివారం మధ్యాహ్నం 1గంట సమయంలో బంధువులు పది మంది కలిసి గ్రామ సమీపంలోని ముదిమాణిక్యం మేజరు కాలవకు ఈత కోసం వెళ్లారు. డ్రాప్ కం బ్రిడ్జి నుంచి కాలువలోకి దూకారు. ముందుగా దూకిన నలుగురు బయటికి వచ్చి కాలువ ఒడ్డుకు చేరారు. మరో ఇద్దరు ఎంతకూ రాక పోయేటప్పటికి కాలువలోకి దిగి చూడగా ఇద్దరూ మునుగుతూ, తేలుతూ కన్పించగా వారిని బయటికి లాగారు. లతీఫ్ అప్పటికే అచేతనంగా మారిపోయాడు. ఇద్దరినీ 108లో మిర్యాలగూడకు తరలించారు. మార్గమధ్యలోనే లతీఫ్ మృతి చెందగా అజీజ్‌కు చికిత్స అందిస్తున్నారు. అజీజ్ కు సీరియస్‌గా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించనున్నట్లు తెలిసింది.

శోకసంద్రంలో కుటుంబం

చేతికి వచ్చిన కుమారుడు అబ్దుల్ లతీఫ్(22) మృతి చెందడంతో ఎస్‌కే సైదావలి కుటుంబం కన్నీరు మున్నీరు అవుతుంది. ఎస్‌కే సైదావలి నారమ్మగూడెంలో ఉంటూ చుట్టు పక్కల గ్రామాల్లో శుభకార్యాలకు వంటలు వండి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సైదావలికి అక్రం, అబ్దుల్ లతీఫ్ ఇద్దరు కుమారులు కాగా ఇద్దరూ హైదరాబాద్‌లో ఉంటున్నారు. లతీఫ్ బీటెక్ చేసి గత ఏప్రిల్‌లో కాలేజీ క్యాంపస్ సెలక్షన్స్‌లోసాఫ్ట్ వేర్ ఉద్యోగానికి ఎంపికైనాడు. పెద్ద కుమారుడు అక్రం వివాహం శుక్రవారం జరిపించాడు. ఆదివారం జరిగే వలీమా కోసం శనివారం గ్రామానికి వచ్చారు. ఉద్యోగం చేస్తున్న చిన్న కుమారుడు కటుంబానికి అండగా ఉంటాడనుకుంటే అనుకోకుండా నీటి ప్రమాదంలో మృతి చెందడం పట్ల ఆకుటుంబం తీవ్రంగా కన్నీటి పర్యంతం అవుతుంది. అతీఫ్ తండ్రి సైదావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్ బాబు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. మహిళ మృతి

చివ్వెంల(సూర్యాపేట) : అతి వేగంగా వెళ్తున్న బైక్ మరో బైక్‌ను ఢీకొట్టడంతో వివాహిత మృతిచెందగా ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని మున్యానాయక్ తండా గ్రామ స్టేజి వద్ద సూర్యాపేట-ఖమ్మం రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సూర్యాపేటకు చెందిన షేక్ మున్ని (23) తన భర్త శివ , బావ మరిదితో కలిసి బైక్‌పై ఖమ్మం జిల్లా నెలకొండపల్లికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో మున్యా నాయక్ తండా వద్ద ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో మున్ని ఎగిరి కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. ఆమెతోపాటు పాటు బైక్‌పై వెళ్తున్న శివ, బావమరిదితో పాటు, మరో బైక్‌పై వెళ్తున్న మున్యా నాయక్ తండాకు చెందిన లకావత్ నాగుకు తీవ్ర గాయాలయ్యాయి.వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా మార్గ మధ్యలో మున్ని చనిపోయినట్లు బంధువులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట హస్పిటల్‌కు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విష్ణు మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: రైలు నుండి కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడుజ ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం రామాజీపేట పరిధిలోని రైల్వే ట్రాక్ 253,13-15 మైలు రాయి వద్ద శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాజీపేట గ్రామం వద్ద రైల్వే ట్రాక్ పక్కన ఓ వ్యక్తి తెల్లవారు జామున మృతదేహం పడి ఉండడం చూసి, గ్రామస్తులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతుడు నీలాపు రఘునాథరెడ్డి (45) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్టణం వాసిగా పోలీసులు గుర్తించారు. కాగా గుర్తు తెలియని రైలు నుంచి కింద పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.